హిమాలయాలను తలపించేలా..



వాల్మీకిపురం పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయ పరిసర ప్రాంతానికి అత్యంత చేరువలో ఉన్న వీరభద్రాద్రి (వీరన్న కొండ)పై సుందర దృశ్యాలు హిమాలయాలను తలపించాయి. పట్టణానికి చెందిన పలువురు యువకులు వేకువజామున వీరన్నకొండ ప్రాంతం వీక్షణకు వెళ్లిన సమయాన హిమాలయాలను తలపించే అపురూప దృశ్యాలు కనిపించడంతో వారి సెల్ ఫోన్లలో దృశ్యాలను చిత్రీకరించారు. కొండ ప్రాంతం మొత్తం సమీపంలోని శతశృంగ (నూరుకుప్పలకొండ) పర్వతాలను ఉదయం 7 గంటలు దాటినా దట్టమైన మంచు కప్పేసింది. కొండ పైన ఉన్న పూలచెట్లు ఆకర్షణీయంగా కనిపించాయి.

● వీరన్నకొండను కప్పేసిన మంచు

- వాల్మీకిపురం (ఆంధ్రజ్యోతి)





పోలీసులతో వాగ్వాదం



ఇసుక టెండర్లలో..
బీటెక్ రవి అనుచరుల హంగామా

● గనుల శాఖ కార్యాలయంలోకి ఎవ్వరినీ వెళ్లనివ్వకుండా..
● కార్యాలయానికి తలుపు వేసి అడ్డుకున్న వైనం
● కూటమి నేతల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
● పోలీసుల రాకతో చివరికి టెండర్లు వేసేందుకు అనుమతి

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక తవ్వకాల కోసం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన టెండర్లలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులు హంగామా సృష్టించారు. పులివెందుల, చక్రాయపేట, వేముల ప్రాంతాల నుంచి భారీగా బీటెక్ రవి అనుచరులు కలెక్టరేట్ డీడీ కార్యాలయం వద్దకు చేరుకుని టెండర్లు వేసేందుకు వెళ్లే వారిని అడ్డుకున్నారు. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకానొక సమయంలో కూటమి నేతలు అరుచుకుంటూ కేకలు వేసుకుంటూ బాహాబాహీకి సిద్ధమయ్యారు. ఇంతలో వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి గుంపును చెదరగొట్టారు. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం గండికొవ్వూరు, రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలంలోని గుండ్లమూల ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వేందుకు భూగర్భగనుల శాఖ ఈ నెల 4వ తేదీన ఆఫ్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించింది. చివరి తేది గురువారం అని నిర్ణయించింది. దీంతో టెండరులో పాల్గొనేందుకు పలువురు కాంట్రాక్టర్లు గురువారం కలెక్టరేట్‌లోని భూగర్భగనులశాఖ కార్యాలయంలో టెండరు పెట్టిన బాక్సువద్దకు చేరుకున్నారు. అయితే ఉదయం నుంచే బీటెక్ రవి అనుచరులు కార్యాలయం వద్ద మకాం వేశారు. గడువు ముగుస్తుండడంతో టెండర్లు వేసేందుకు వస్తున్న వారిని వీరు అడ్డుకున్నారు. కొంతమంది కార్యాలయానికి గడియ వేసుకుని లోపల కూర్చున్నారు. బయటి నుంచి టెండరు వేసేందుకు లోపలికి పోనివ్వకుండా అడ్డుకున్నారు.

మీడియా సిబ్బందిపైనా దౌర్జన్యం

టెండర్లు వేసేందుకు కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అనుచరులు, సిద్దవటానికి చెందిన జనసేన నేత అతికారి వెంకటసుబ్బయ్య వచ్చారు. వీరందరినీ బీటెక్ రవి అనుచరులు లోపలికి పోనీకుండా అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తతగా మారింది. ఆ దృశ్యాలను వీడియోలు తీస్తున్న మీడియా సిబ్బందిపై కూడా దౌర్జన్యానికి దిగారు. వీడియో డెలిట్ చేయమని బెదిరించడంతో మీడియా సిబ్బంది పక్కనే ఉన్న ఐఎన్‌బీ కార్యాలయానికి వెళ్లి తలదాచుకున్నారు. పెద్దగా కేకలు అరుపులు వేసుకుంటుండడంతో వన్‌టౌన్ సీఐకి సమాచారం అందడంతో ఆయన హుటాహుటిన అక్కడకు వచ్చి గుంపును చెదరగొట్టారు. వీరిని పంపించాక కార్యాలయం తలుపులు తెరిచి టెండర్లు వేసేందుకు మార్గం సుగమం చేశారు. సాయంత్రం 5.30 వరకు టెండర్లు వేయించి అనంతరం బాక్సులు సీజ్ చేసి కలెక్టరేట్‌లోకి తరలించారు. గండికొవ్వూరు రీచ్‌కు రెండు టెండర్లు, గుండ్లమూల రీచ్‌కు 14 టెండర్లు వచ్చాయి.

గనులశాఖ నిర్లక్ష్యం

కూటమి నేతల మధ్యనే ఇసుక టెండర్ల కోసం గొడవ జరగడం చూసి ఔరా అంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు కలెక్టరేట్ ప్రాంగణంలోనే గొడవలు, కేకలు అరుపులు వేయడంతో చుట్టుపక్కల అధికారులు ఏం జరుగుతుందోనని భయంభయంగా గడిపారు. పోలీసులు రాకుంటే పరిస్థితి చేయి దాటిపోయేది. వాస్తవంగా అయితే ఈ రెండు రీచ్‌లకు సంబంధించి కోర్టులో కేసులున్నాయి. అయినప్పటికీ గనులశాఖ అధికారులు టెండర్లు పిలవడం గమనార్హం. ఇక బీటెక్ రవి అనుచరులు మైనింగ్ కార్యాలయాన్నే ఆక్రమించి బయటి నుంచి ఎవరినీ రానీయకుండా అడ్డుకోవడం చూసి కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్‌లైనులో టెండర్లు జరిగితే కనీసం భూగర్భశాఖ అధికారులు పోలీసులను బందోబస్తు కోరకపోవడం గమనార్హం. గనులశాఖ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బీటెక్ రవి అనుచరులు లోపల నుంచి గనుల శాఖ కార్యాలయం తలుపులు వేసియడంతో టెండరు వేసేందుకు వచ్చిన వారు బయట నిల్చున్న దృశ్యం

రాయచోటి టు బెంగళూరు

● తరలుతున్న రేషన్ బియ్యం
● కొనేది రూ.10కి.. అమ్మేది రూ.40
● నెలకు రూ.కోట్ల ఆర్జన
● పట్టుకున్నవి కొన్ని.. తరలిపోతున్నవి ఎన్నో?
● అధికార పార్టీ నాయకుల మధ్య బియ్యం చిచ్చు



రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు జిల్లా కేంద్రం రాయచోటి అడ్డాగా మారుతోంది. రాయచోటి నుంచి బెంగళూరుకు రేషన్‌బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా తరలిపోతోంది. కొందరు జిల్లా రైస్ మిల్లుల సంఘం నాయకులే ఈ బియ్యం తరలింపులో ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు ఇక్కడ కిలో రూ.10కి కొని.. బెంగళూరులో రూ.40కి తక్కువ కాకుండా అమ్ముకుంటూ.. నెలనెలా కోట్ల రూపాయలు అక్రమంగా జేబులో వేసుకుంటున్నారు. ఈ అక్రమ చౌకబియ్యం రవాణా వ్యవహారం జిల్లా తెలుగుదేశం పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధుల మధ్య చిచ్చు పెడుతోంది. అక్రమ బియ్యం వివాదం అధికార పార్టీలో ఎన్ని పరిణామాలకు దారి తీస్తుందోనని సర్వత్రా చర్చ నడుస్తోంది.



గుర్రంకొండ పోలీసులు పట్టుకున్న రేషన్‌బియ్యం లారీ (ఫైల్)



సంబేపల్లె మండలం సోమవరంలో గోడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తరలింపులో తలలు పండిన కొందరు మిల్లుల యజమానులు, వ్యాపారులు అధికార పార్టీకి చెందిన పెద్దవాళ్ల పేరు చెప్పి దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు వైసీపీ ప్రభుత్వంలో పలువురు ఎమ్మెల్యేలే చౌక బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్నారనే ఆరోపణలు ఉండేవి. దీంతో కొందరు వైసీపీ నాయకులు దర్జాగా చౌకబియ్యాన్ని సరిహద్దులు దాటించారు. ఇప్పుడు కూడా అదే అక్రమ రవాణా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నెలకు సుమారు 10 టిప్పులు చౌక బియ్యం జిల్లా కేంద్రం నుంచి బెంగళూరుకు తరలుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రస్తుత అధికార పార్టీ నాయకుల మధ్యలో.. ఎవరి మాట వినాలో? ఎవరి మాట వినకూడదో తెలియక.. సతమతమవుతున్నారనే ప్రచారం ఉంది.

ఇంటింటికీ తిరిగి.. కొనుగోలు చేసి

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా చౌక బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఎండీయూ వాహనదారులు ఇంటింటా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసే క్రమంలో ఎవరైనా బియ్యం వద్దంటే వాటిని కిలో రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాయచోటి పట్టణంలోని కొత్తపేట, బోస్‌నగర్, రామాపురం, పాతరాయచోటి, కొత్తపల్లె, మాసాపేట, ఎస్ఎన్ కాలనీతో పాటు ఇంకా పలు ప్రాంతాల నుంచి చౌకబియ్యాన్ని కొనుగోలు చేస్తారు. మదనపల్లె పట్టణంలో ఈశ్వరమ్మ కాలనీ, కొత్తయిండ్లు, మోతీనగర్, నీరుగట్టువారిపల్లె, తదితర ప్రాంతాలలో కూడా బియ్యాన్ని కొనుగోలు చేస్తారు. ఇంటింటికీ తిరిగి సేకరించే చిరు వ్యాపారులు.. అయిదు నుంచి పది క్వింటాళ్లు సేకరించాక బయటి వ్యాపారులకు అమ్ముతున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలలో తరలించి తమకు అనువైన చోట నిల్వ ఉంచుకుంటారు. వీటిని బడా వ్యాపారులు కొనేసి.. తమ మిల్లుల్లో పాలీష్ పట్టి.. సన్న బియ్యంగా మార్చి బెంగళూరుకు తరలించి, కిలో రూ.40కి తక్కువ కాకుండా అమ్ముకుంటున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి కర్ణాటకకు ప్రభుత్వ చౌకబియ్యం తరలిపోతోంది. నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల సరిహద్దులో కర్ణాటక ఉంది. దీంతో ఇక్కడి నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా సులువుగా మారింది.

చెక్‌పోస్టుల మూతతో జోరుగా రవాణా

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని రామసముద్రం మండలంలో నాలుగు, పెద్దతిప్ప సముద్రం మండలంలో నాలుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆరునెలలకు ముందు యాక్టివ్‌గా పనిచేసిన ఈ కేంద్రాలు ప్రస్తుతం మూతబడ్డాయి. రామసముద్రం మండలంలోని చెంబకూరు, రామసముద్రం, ఎ.కొత్తూరు, చొక్కాండ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలంలోని అంకాలమడుగు, చంద్రాయునిపల్లె క్రాస్, మార్గానిపల్లె, మల్లెల గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ మూతబడ్డాయి. మదనపల్లె మండలంలోని చీకలబైలు వద్ద ఉన్న చెక్‌పోస్టు పనిచేస్తోంది.

అధికార పార్టీలో చిచ్చు

చౌకబియ్యం అక్రమ రవాణా చేసే కొందరు వ్యాపారులు పలువురి వద్ద చౌక బియ్యం కొనుగోలు చేసి తమ మిల్లులు, లేదా తమకు తెలిసిన వాళ్ల మిల్లుల్లో పాలీష్ చేసి సన్నబియ్యంగా మార్చి అక్రమంగా తరలించి అమ్ముకుంటారు. అయితే ప్రస్తుతం ఈ అక్రమ రవాణా వెనుక జిల్లా రైస్‌మిల్లుల అసోసియేషన్‌కు చెందిన ఓ ముఖ్యనాయకుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ బియ్యం రాష్ట్ర సరిహద్దు దాటాలన్నా ఈయన కనుసన్నల్లోనే నడుస్తోందనే ప్రచారం ఉంది. గత ఏడాది డిసెంబరులో కలకడ మండలంలో రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు జరిపి 151 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీని వెనుక రైస్‌మిల్లుల అసోసియేషన్‌కు చెందిన నాయకుడి హస్తం ఉన్నట్లు గ్రహించిన సదరు బియ్యం నిలువ చేసుకున్న వ్యాపారి అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనాయకునికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అప్పటి నుంచి ఆ వ్యాపారి కాపు కాసి బుధవారం తెల్లవారుజామున బెంగళూరుకు తరలిస్తున్న బియ్యాన్ని గుర్రంకొండ పోలీసులకు పట్టించాడని ప్రచారం జరుగుతోంది. ఈ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాపారి ఈ విషయాన్ని అధికార పార్టీలోని మరో ముఖ్యనాయకునికి ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ సంఘటనపై అధికార పార్టీలోని ఇద్దరు పెద్ద తలకాయలు స్వయంగా రంగంలోకి దిగినట్లు ప్రచారంలో ఉంది. ఈ అక్రమ బియ్యం స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేయాలని ఓ ముఖ్యనాయకుడి అనుచరులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. అయితే ఇవి చౌక బియ్యం కావు కేసు నమోదు చేయకుండా.. బియ్యాన్ని వదిలేయాలని మరో ముఖ్య నాయకుడి అనుచరులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి తమ అదుపులో ఉంచుకున్న బియ్యం లోడు లారీని సాయంత్రం 5 గంటల సమయంలో పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో చౌకబియ్యం రవాణా వ్యవహారం జిల్లా తెలుగుదేశంలో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో? అని పలువురు చర్చించుకుంటున్నారు.

అడపాదడపా కేసులే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు కలిసి అడపాదడపా దాడులు జరిపి చౌకబియ్యం పట్టుకుని కేసులు నమోదు చేశారు. గత నెలలో మదనపల్లె-బెంగళూరు మార్గంలోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద పది క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు.

● కలకడ మండలంలో గత నెల 9వ తేదీ రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి బాలయ్యగారి పల్లె పంచాయతీ ఎర్రయ్యగారిపల్లె సినిమా హాల్‌కు సమీపంలోని ఓ గోడౌన్‌లో ఆర్.వెంకటరమణకు చెందిన 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే పంచాయతీ పరిధిలోని సిద్దేశ్వర ఆలయం మార్గంలోని సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీ గోడౌన్‌లో మరో వ్యక్తి నిల్వ ఉంచిన 145 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● గత ఏడాది డిసెంబరు 8న సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం దేవళంపేట సమీపంలోని కోళ్లషెడ్డు, గోడౌన్లలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యం స్థావరంపై స్వయంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ దాడులు చేసి 209 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

● రాయచోటి పట్టణంలో ఈనెల మొదటి వారంలో లక్ష్మీ థియేటర్ వెనుకభాగంలో ఒక వ్యక్తి నుంచి 560 బస్తాల చౌక బియ్యాన్ని ఒక గదిలో నిలువ చేసి ఉండగా రాయచోటి అర్బన్ పోలీసులు స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారు.

● ఇదే నెలలోనే రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని ఓ షాదీమహల్ సమీపంలోనూ రాయచోటి అర్బన్ పోలీసులు దాడులు జరిపి 210 బస్తాల చౌకబియ్యాన్ని స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేశారు.

వెంకటరమణ మృతదేహం బయటపడేనా..!

● రెండు రోజులుగా గాలిస్తున్న రెస్క్యూ టీమ్
● అనుమానాలు వ్యక్తం చేస్తున్న బంధువులు
● అధికారుల తీరును నిరశిస్తూ ఆందోళన

7



సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

ఆంధ్రజ్యోతి స్పందన

పీలేరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు తేదీలను పొడిగిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ సంచాలకులు జయసింహ ప్రకటించారు. సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాల్సిన ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరీ సిస్టం (ఏపీఓబీఎంఎంఎస్) వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదంటూ గురువారం ఆంధ్రజ్యోతిలో 'సబ్సిడీ రుణాలకు తెరుచుకోని వెబ్‌సైట్' పేరుతో కథనం ప్రచురితమైంది. సాంకేతిక కారణాలతో తెరుచుకోని వెబ్‌సైట్ కారణంగా సబ్సిడీ రుణాల ఆశావహులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసింది. దీంతో స్పందించిన జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ సంచాలకులు జయసింహ గురువారం ఆ పథకాల దరఖాస్తుల గడువును పొడిగిస్తున్నట్లు పత్రికా ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక కారణాలతో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ తెరుచుకోని మాట వాస్తవమేనని, గడువు ముగిసిందని ఆశావహులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆ వెబ్‌సైట్ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తరువాత తదుపరి తేదీలను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని ఆయన తెలియజేశారు. దీంతో ఆశావహులకు కొంత మేర ఉపశమనం లభించింది.

'పీఎం ఇంటర్న్‌షిప్' యువతకు సువర్ణావకాశం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎం ఇంటర్న్‌షిప్ స్కీం) యువత ఉపాధికి సువర్ణావకాశమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఇంటర్న్‌షిప్ పథకానికి సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో పనిఅనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. ఇంటర్న్‌షిప్ చేయడానికి టాప్ 500 కంపెనీలతో ఒప్పందం, 6-12 నెలల ఇంటర్న్‌షిప్ (కనీసం ఆరు నెలలు ప్రాక్టికల్ పని), ఇంటర్న్‌షిప్‌లో ఎంపికైన వారికి వన్‌టైమ్ గ్రాంట్ రూ.6 వేలు, ప్రతినెలా రూ.4500 కేంద్ర ప్రభుత్వం నుంచి, రూ.500 పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం మొత్తం రూ.5 వేలు. బీమా పరిరక్షణ పీఎంజేజేవై (ప్రధాన మంత్రి జీవిత బీమా యోజన), పీఎంఎస్‌బీవై (ప్రధాన మంత్రి ప్రమాద బీమా యోజన) సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 24 సంవత్సరాలు కలిగి, పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఫార్మా, బీటెక్ వంటి డిగ్రీలు పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్ చదువుతున్నవారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేగవంతంగా మౌలిక వసతుల కల్పన

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్



ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ నగర గృహ నిర్మాణ లేఅవుట్లలో మౌలిక వసతులను వేగవంతంగా కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు ఎదురుగా గల ఎన్టీఆర్ నగర్ గృహ నిర్మాణ లేఅవుట్‌లో ప్రగతిలో ఉన్న గృహ నిర్మాణాలను, మౌలిక వసతుల ఏర్పాట్లపై జరుగుతున్న తనిఖీ చేశారు. దిగువ అబ్బవరం ఎన్టీఆర్‌నగర్‌లో మొత్తం మంజూరైన గృహాలు 93 కాగా పూర్తయిన గృహాలు 43 ఉన్నాయని, ఆర్సీ లెవెల్‌లో 3 గృహాలు ఉండగా, ఆర్ఎల్ లెవెల్‌లో 9 గృహాలు ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో 568 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 185 గృహాలు పూర్తయ్యాయని, ఆర్సీలో 33 గృహాలు, ఆర్ఎల్‌లో 98 గృహాలు, మిగిలిన గృహాలు బీఎల్, బీబీఎల్‌లో ఉన్నట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్సీ, ఆర్ఎల్‌లో ఉన్న గృహాలన్నీ ఈనెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి ప్రధాన అప్రోచ్ రోడ్డు 310 మీటర్లు ఉందని, ఆ కాలనీతో పాటు ఎదురుగా ఉన్న లేవుట్‌లో కూడా సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి వివరించారు. లేఅవుట్లలో కొంత మేర ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేసే క్యూరింగ్ చేయడం జరుగుతోందని వివరించారు. నెలాఖరులోగా సీసీ రోడ్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. లేఅవుట్‌లలో నీటివసతి, విద్యుత్ సౌకర్యం అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. నీటి ఇబ్బందులు లేకుండా అవసరమైతే ప్రస్తుతం ఉన్న బోర్లను రీచార్జ్ చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్‌నగర్ ప్రవేశ మార్గం వద్ద పీఎంఏవై, ఎన్టీఆర్ నగర్ ఆర్చ్ నిర్మాణం వెంటనే చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించారు. ఆర్చ్ నిర్మాణానికి విద్యుత్ లైన్లు అడ్డు వస్తాయని అక్కడి వారు తెలుపగా రేపటిలోగా విద్యుత్ లైన్లను పక్కకు మార్చాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ సహదేవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ గుణశేఖర్‌పిళ్లై, హౌసింగ్ డీఈ సుబ్బరామయ్య, ఏఈ రాంమోహన్ రెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మ ఊరేగింపులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

7

రెవెన్యూ దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సం బంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, ప్రభుత్వ భూముల గుర్తి ంపు, పల్లె పండుగ పనుల ప్రగతి తదితర అం శాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్, రెవె న్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తప్పనిసరి విచారణ చేప ట్టాలన్నారు. కనీసం రోజుకు ఐదు దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. అలాగే రీ సర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకుని వాటిని పీజీఆర్ఎస్‌లో వెంటనే ఆన్‌లైన్ చేసి పరిష్కరించాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రతి మండల కార్యాలయం నుంచి ఈ ఆఫీసు లోనే జిల్లా కేంద్రానికి ఫైల్స్ పంపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు తగిన విధంగా ప్రతి మండల కార్యాలయంలో ఈ ఆఫీస్‌పై తహసీల్దార్, సంబంధిత సిబ్బంది వెంటనే శిక్షణ పొందాలని తెలిపారు. పల్లె పండుగకు సంబంధించిన పనులన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఇంకా ప్రారంభం కాని పను లు ఉన్నాయా అని ఆరా తీశారు. పనులు పూర్తికి అవసరమైన చోట ఉపాధి హామీ ద్వారా అదనంగా నిధులు మంజూరు చేయడానికి ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, గోకులాలు, కాలువలు తదితర మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, డ్వామా పీడీ వెంకటరత్నం, మండల స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు నిర్వహించే జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, బుక్‌లెట్లు బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీవో, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో సోమవారం జరిగిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గురువారం ఉదయం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరీ విభాగం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎద్దులు పాల్గొనగా... నువ్వా, నేనా అన్నట్లు సాగిన పోరులో నంద్యాల పట్టణం పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణలోని సూర్యాపేట, హుజూరునగర్‌కు చెందిన సుంకి సురేంద్రారెడ్డి కంబైండ్ కాడెద్దులు 25 నిమిషాల వ్యవధిలో 3,643 అడుగులు దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. మైదుకూరుకు చెందిన కేవీఎస్ బుల్స్ కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 3,260 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 3,147 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు 3,208 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలవగా, గుంటూరు జిల్లా కుంచెనపల్లికి చెందిన వులం త్రిస్నారెడ్డి కాడె 2,806 అడుగులు లాగి 5వ స్థానం దక్కించుకున్నాయి. కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,788 అడుగులు లాగి 6వ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. విజేతలకు మొదటి బహుమతిగా రాయల్ ఇన్‌ఫీల్డ్ 350 సీసీ (బుల్లెట్), రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుతి టీవీఎస్ ఫోర్ట్, 4వ బహుమతిగా టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25వేలు, 6వ బహుమతిగా రూ.15వేలు అందజేశారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేద్దాం : కలెక్టర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసి.. ప్రాణాలు కాపాడుకుందామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని దారి భద్రత ప్రచారం (శ్రద్ధ వహించండ) కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలు 2025లో భాగంగా 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రహదారి ప్రమాదాల క్షతగాత్రులకు నిస్వార్థంగా, స్వచ్ఛందంగా సహాయం అందించి, దగ్గరలోని ఆసుపత్రికి చేర్చాలన్నారు. గుడ్ సమిరిటన్‌కు రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీఓలు జాన్ ఇర్వీన్, సాయిశ్రీ, చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ హజ్రతయ్య, డీటీసీ, రవాణాశాఖ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భర్త మృతదేహంతో నిరసన

● న్యాయం చేయాలని వేడుకోలు


వెంకటయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చాపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో షంద్ర యశోద తన భర్త వెంకటయ్య (35) మృతదేహాన్ని గురువారం అదే గ్రామానికి చెందిన ఎర్రిబోయిన ప్రసాదు ఇంటి ముందు ఉంచి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈనెల 15న బుధవారం వెంకటయ్య ఆ గ్రామం వద్ద ఉన్న బావిలో కాలు జారి నీళ్లలో పడి మృతి చెందాడు. యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, తన భర్త వెంకటయ్య వ్యవసాయకూలి పనులకు ప్రతి రోజూ ప్రసాదు పొలం వద్దకు వెళ్లేవాడని.. ఈ క్రమంలో భర్త చనిపోవడంతో కుటుంబానికి దిక్కులేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారని.. తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరుతూ.. గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేసింది. విషయం తెలిసిన ఎస్ఐ చిన్నపెద్దయ్య అక్కడకు చేరుకుని యశోదకు నచ్చచెప్పడంతో ఆమె ఆందోళన విరమించింది.

వెంకటరమణ మృతదేహం బయటపడేనా...!

● రెండు రోజులుగా గాలిస్తున్న రెస్క్యూ టీమ్

● అనుమానాలు వ్యక్తం చేస్తున్న బంధువులు

● అధికారుల తీరును నిరశిస్తూ ఆందోళన


వెంకటరమణ గల్లంతైన క్వారీ వద్ద ప్రజలు


కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

గుర్రంకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి క్వారీలో పడి మృతి చెందినట్లు చెబుతున్న వెంకటరమణ (24) మృతదేహం లభ్యం కాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీటిలో పడిన ఏ వ్యక్తి అయినా చనిపోతే 24 గంటల తరువాత మృతదేహం నీటిపై తేలుతుందన్నారు. వెంకటరమణ క్వారీలో పడి 30 గంటలు గడిచినా మృతదేహం తేలకపోవడం, రెండు రోజులుగా ఫైర్, రెస్క్యూ టీమ్ సభ్యులు గంటల తరబడి వెతికినా మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో అధికారుల తీరును నిరసిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దద్దాలవారిపల్లెకు సమీపంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై గురువారం ధర్నా చేశారు. తమ కుమారుడిని వెతకడంతో అలసత్వం చేస్తున్నారంటూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు బారులు తీరాయి. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకొన్న తహశీల్దార్ శ్రీనివాసులు, వాల్మీకీపురం సీఐ ప్రసాద్‌బాబులు బాధితులతో మాట్లాడి మృతదేహాన్ని వెలికితీయడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కర్నూలు నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందం వస్తున్నట్లు తెలిపారు. ఈ బృందం రాగానే మృతదేహాన్ని గంటల వ్యవధిలోనే బయటకు తీస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, క్వారీలో వెంకటరమణ మృతదేహం ఉందా... ఉంటే ఎందుకు దొరకడం లేదు... లేకపోతే వెంకటరమణను తోడుగా వచ్చిన వారు ఏమైనా చేశారా అన్న అనుమానాలను బంధువులు వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరమణ ఎక్కడున్నావురా....

పండగ పూట స్నేహితులతో కలిసి ఆడుకొని తిరిగి ఇంటికి వస్తానంటివే...అంతలోనే కనబడకుండా పోతివే.. అంటూ వెంకటరమణ తండ్రి సూరి బోరున విలపించడం చూపరులను కలచివేసింది.

ట్రాక్టర్ల చోరీ కేసులో నిందితుడు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల సీఐ

సింహాద్రిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన గత నెల 29వ తేదీ రాత్రి ఒక ట్రాక్టరు, రెండు ట్రాలీలు చోరీకి గురయ్యాయి. ఈ కేసుకు సంబంధించి నిందితుని అరెస్ట్ చేసినట్లు పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు... బాధితుడు కటికిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ నేతృత్వంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌తో కలసి విచారణ చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో పులివెందుల మెయిన్ రోడ్డులోని హిమకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన సింహాద్రిపురం గ్రామం బీడీ కాలనీకి చెందిన యర్రగుడి బాబా అలియాస్ చోటును అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారణ చేయగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, లింగాల ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి



కమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండలం గంగవరం ఎంపీయూపీ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తులసీధర్ (55) గురువారం ఉదయం ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తులసీధర్ మూడు రోజుల క్రితం బైకులో కడపకు వెళుతుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కడపలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతి చెందాడు. ఈయన స్వస్థలం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామం. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే తులసీధర్ మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తులసీధర్ మృతి పట్ల ఉపాధ్యాయసంఘ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

మిద్దెపై నుంచి పడి ఆర్ఎంపీ మృతి


ఓబులవారిపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎంపీ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. ఓబులవారిపల్లెకు చెందిన బసెట్టి సుబ్రమణ్యం (61) మండల పోలీసుస్టేషన్‌కు వెళ్లేదారిలో ప్రథ మ చికిత్స కేంద్రం నడిపేవారు. గురువారం సాయంత్రం మిద్దెపైన జామకాయలు కోసే క్రమంలో కాలుజారి సన్‌సైడ్ బండ మీదపడడంతో తలకు తీవ్రగాయమైంది. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

గొబ్బెమ్మ ఊరేగింపులో ఘర్షణ


గుమికూడిన జనం

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గొబ్బెమ్మ ఊరేగింపులో రెండు వర్గాల యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్థానిక కల్లావీధి నుంచి గొబ్బెమ్మను మహిళలు, యువకులు కేరింతలు కొడుతూ అమ్మవారిని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో మాడవీధికి చెందిన కొంతమంది యువకులు గొబ్బెమ్మ ఊరేగింపులో పాల్గొనేందుకు రావడంతో ఇరువర్గాలు మధ్య ఒక్కసారిగా ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అక్కడే ఉన్న మహిళలు, యువకుల మధ్య ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఇరువర్గాలవారు పెద్దఎత్తున ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గొబ్బెమ్మ మీద ఊరేగింపులో పాల్గొనే మహిళలపై దాడి చేయడంతో ఒక్కసారిగా వారి బంధువులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం ఎస్ఐ శివప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఘటన స్థలానికి వచ్చిన ఎస్ఐ శివప్రసాద్ ఇరువర్గాలవారిని చెదరగొట్టారు. దాడిలో బంగారు చైనుతో పాటు బంగారు వస్తువులు పోయినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలవారిని పిలిపించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

బస్సు బోల్తా... పలువురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో బోల్తాపడ్డ బస్సు, గాయపడ్డ ప్రయాణికులు

కురబలకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి బెంగళూరుకు వెలుతున్న బస్సు మార్గమధ్యంలోని కురబలకోట మండలం జంగా వారిపల్లె సమీపంలో డ్రైవర్ కునుకు తీయడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈప్రమాదంలో 10మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తా పుల్లారెడ్డికి భూతపురి స్మారక పురస్కారం


పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ సాహితీవేత్త భారత భారతి పుత్తా పుల్లారెడ్డి మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 23వ స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ భూత పురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యం లో ఫిబ్రవరి 16న ఆదివారం ఉదయం 10గంటలకు కడప సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో జరిగే భూతపురి 88వ జయంతి మహోత్సవంలో ఈ పురస్కారం అందజేయనున్నారు. సాహిత్య జ్యోతిష్య రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు 2003 నుంచి ఈ పురస్కారం అందిస్తున్నట్లు భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి భూతపురి శివరామసురేంద్ర శర్మ తెలిపారు. ఆక్రమంలో పుత్తా పుల్లారెడ్డిని రూ.10,116లతో నగదు, జ్ఞాపికతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. వృత్తిరీత్యా ఇంజనీరు అయిన పుత్తా పుల్లారెడ్డి పదవీ విరమణ తరువాత సాహిత్యరంగంలో అడుగుపెట్టి అనేక పరిశోధనాత్మక రచనలు, వ్యాఖ్యానాలు, సంకలన గ్రంథాలు, రచనలు వెలువరించడం విశేషమన్నారు. పుత్తా పుల్లారెడ్డి నీటిపారుదల శాఖలో సూపర్‌వైజర్ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయి వరకు పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి పలు సంస్థలు ఘనంగా సత్కరించాయని తెలిపారు.

రైతు బిడ్డకు జంప్‌రోప్‌లో బంగారుపతకం


రామిరెడ్డి ప్రసన్న

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముతుకూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి ప్రసన్న జంప్‌రోప్ క్రీడలో అద్భుతంగా రాణిస్తోంది. అంతర్జాతీయస్థాయిలో నేపాల్‌లో జరిగిన పోటీల్లో వివిధ దేశాలతో పోటీపడి బంగారు పతకం అందుకుంది. పేద రైతు రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి, రామలక్షుమ్మల కుమార్తె ప్రసన్న సింహాద్రిపురం కస్తూర్బా పాఠశాలలో చదుకుంటూ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జంప్‌రోప్ క్రీడల్లో పాల్గొంది. అంతర్జాతీయస్థాయిలో కూడా రాణించి పతకాలు సాధించింది.

అక్రమ కట్టడాలు కూల్చివేత


అక్రమ కట్టడాలను కూల్చి వేయిస్తున్న వీఆర్వో శ్రీనివాసులు

కడప కలెక్టరేట్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి) నగర పరిధి లోని ఉక్కాయపల్లి బైపాస్ రోడ్డు, చలమారెడ్డిపల్లెలో ప్రభు త్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది గురు వారం రాత్రి కూల్చివేశారు. నాలుగు సెంట్ల స్థలంలో సెలవు రోజుల్లో కబ్జాదారులు రాత్రికి రాత్రి అక్రమంగా బేస్ మట్టాలు నిర్మించారు. విషయం తెలుసుకున్న తహ సీల్దారు నారాయణరెడ్డి వెంటనే నిర్మాణాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ శివకుమార్‌లు ఆస్థలంలో నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంటంపల్లె గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి, గాండ్లపల్లెకు చెందిన రవికుమార్ మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత 26న ఇరువురు స్థానిక గంగమ్మ గుడి వద్ద డబ్బులు విషయమై ఘర్షణ పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోవడంతో బాధితుడు మనోహర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

రాయచోటిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటిటౌన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిధిలోని మదనపల్లెరోడ్డు మార్గాన గుడిసెల్లో నివసించే పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత వెంకట్రమణ మాట్లాడుతూ తన కుమార్తె రూపశ్రీ పుట్టిన రోజు సందర్భంగా తనవంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే గుడిసెల్లో నివసించే పేదలకు అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్, రాయచోటిశాఖ అధ్యక్షుడు శివారెడ్డి, సభ్యులు భానుప్రకాశ్ పాల్గొన్నారు.

కంకర వేశారు... రోడ్డు మరిచారు

● ఆదమరిస్తే అంతే సంగతులు

సిద్దవటం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కంకర పరిచి రోడ్డును వేయకుండా మరచిన ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో అటు పల్లె ప్రాంత ప్రజలకు, ఇటు వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని జ్యోతి, వెంకటాయపల్లె గ్రామం వరకు రూ.40 లక్షల రోడ్డు పనులకు కడపకు చెందిన కాంట్రాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి టెండరు దక్కించుకుని డిసెంబరు చివరివారంలో పనులు మొదలుపెట్టారు. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో కంకర పరిచి 13 రోజులు కావస్తున్నా రోడ్డు వేయకుండా ఉండడంతో జ్యోతి, గొల్లపల్లె, పి.కొత్తపల్లె, వెంకటాయపల్లె గ్రామస్థులకు ఇబ్బందులు తలెత్తాయి. పల్లె ప్రాంతాల్లో బస్సు సౌకర్యం లేక ఆటోల్లో ఇతర ప్రాంతాలకు వెళుతూ రహదారి సరిగ్గా లేక పలు గ్రామ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు రహదారి పనులు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు. కాగా ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా.. జ్యోతి, వెంకటాయపల్లె ఆర్ అండ్‌బీ రోడ్డు పనులకు కాంట్రాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి టెండర్ దక్కించుకున్నారని, త్వరగా పనులు చేయమని ఆయనను ఆదేశించామన్నారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని, మార్చినెలలోపు మండలంలో దెబ్బతిన్న రహదారి పనులు పూర్తవుతాయని తెలిపారు.


కంకర వేసి వదిలేయడంతో ఆటోలు రాక కాలినడకన వెళుతున్న గొల్లపల్లె వాసులు

రైల్వేగేటు మూసివేత

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేటు నెం:89 మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా 19, 20 తేదీల్లో అంతరాయం ఉంటుందన్నారు.

రైతుల సంతోషమే చంద్రబాబు లక్ష్యం

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంతోషమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం సోమశిల వెనుకజలాలైన శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువు నీటిని, మోటార్లను ప్రారంభించారు. అనంతరం స్థానిక చెరువు కట్టపై పైపులైను వద్ద జలహారతిని చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్ నాయుడుతో కలిసి చెరువుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ప్రజల ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగ కల్పన, నూతన పెట్టుబడులపై చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని రైతుల కోసం నీటిని తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిళ్ల శ్రీహరి, ఈశ్వరయ్య, బాలమునయ్య, శివారెడ్డి, హరినాధ్‌రెడ్డి, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు గంగిరెడ్డి, భానుప్రకాష్ రాజు, రైతులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వెలుగుపల్లెలో 'పొలం పిలుస్తోంది'

సిద్దవటం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెలుగుపల్లె, జంగాలపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలుగుపల్లె, నారాయణస్వామి దేవాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించి వ్యవసాయశాఖ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నూతన సాంకేతిక అంశాలను డ్రోన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా గౌరమ్మ వేడుకలు

రాజంపేటటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం మందపల్లె గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గౌరమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువత గొబ్బెమ్మ పాటలు పాడుతూ గ్రామోత్సవం నిర్వహించారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు భక్తి శ్రద్ధలతో మహిళలు గౌరమ్మను అలంకరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గొబ్బెమ్మ పాటలు పాడుతూ డప్పు వాయిద్యాల నడుమ గొబ్బెమ్మ ఊరేగింపు జరిగింది. చెయ్యేరు నదిలో గొబ్బెమ్మను నిమజ్జనం చేశారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

వీరబల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో బెజవాడ హరిజనవాడకు చెందిన వైసీపీ కార్యకర్త బెజవాడ సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సుబ్బయ్య భౌతికకాయాన్ని పరిశీలించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్రప్పగారిపల్లె సర్పంచ్ ఈశ్వరయ్య, స్థానిక వైసీపీ రైతు నాయకులు పాల్గొన్నారు.

బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలి

సంబేపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి డిపోకు చెందిన బస్సు సర్వీసును ఎస్.సోమవరం గ్రామం దేవళంపేట మీదుగా మదనపల్లె వరకు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు గురువారం తెలిపారు. బస్ సర్వీస్ ఏర్పాటు కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ మార్గంలో బస్ సర్వీస్ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. ఈ మార్గం గుండా బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సిద్దిక్ మృతదేహానికి నివాళులు

రాయచోటిటౌన్,జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శిబ్యాల కస్పాకు చెందిన అబూబకర్ సిద్దిక్(23) మృతదేహానికి గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న భౌతిక కాయానికి నివాళులర్పించి ప్రమాద సంఘటనపై ఆరా తీశారు.

బొప్పాయి తోటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కూటమి నాయకులు

చిట్వేలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అడవి పందులు ధ్వంసం చేసిన బొప్పాయి తోటలను రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ గురువారం పరిశీలించారు. ఇటీవల మైలపల్లె పంచాయతీ ఎం.రాచపల్లెలో బొప్పాయి తోటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. ఈశ్వర్‌రాజు, పెంచల్‌రాజు, చాముండేశ్వరి తదితర తోటల్లో 20,800 మొక్కలను పందులు నాశనం చేశాయి. దీంతో ఒక్కో రైతుకు రూ.లక్ష చొప్పున పంట నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ పొలాల వద్దకు వెళ్లి పరిశీలించి రైతులను పరామర్శించారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి పంటనష్ట పరిహారం కోసం కృషి చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, గుత్తి నరసింహ, నానబాల నాగార్జున, వెంకటేశ్‌రాజు, మాదాసు నరసింహ, శంకర్‌రాజు, ఏదోటి రాజశేఖర్, శివరాజు, తహసీల్దారు మురళీకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీరాం, ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జయరామయ్యనాయుడుకు సానుభూతి

పెనగలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కాకర్ల జయరామయ్యనాయుడుకు ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సానుభూతి తెలిపారు. జయరామయ్యనాయుడు సతీమణి నారాయణమ్మ గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మరణించడంతో ఆయన శ్రద్ధాంజలి ఘటించారు.

విజేతలకు నగదు బహుమతి

సిద్దవటం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకల్లో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఫైనల్ మ్యాచ్‌లో క్రీడాకారులకు బహుమతులు అందించారు. మండలంలోని దిగువపేట గాంధీవీధిలో మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేది నుంచి ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన గ్రీన్ ఆర్మీ మొదటి టీమ్ విజేతకు రూ.12 వేల నగదు, రెండో టీమ్ అంగ్రీచితాస్ విజేతలకు రూ.8 వేల నగదు ప్రోత్సాహం గురువారం సాయంత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు లక్షుమ్మ, సర్పంచ్ ప్రతినిధి బి.ఓబులయ్య, క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు నగదు అందిస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యురాలు

ఫైనల్లో కారంపల్లె జట్టు విజయం

రాజంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మందపల్లె, కారంపల్లె జట్లు ఫైనల్‌కు చేరుకొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో మందపల్లె టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ తీసుకుంది. 14 ఓవర్లతో బరిలోకి దిగిన మందపల్లె జట్టు 12.4 ఓవర్లలో 92 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సందీప్‌వర్మ అద్భుత బౌలింగ్‌తో 4 ఓవర్లలో 21 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీశారు. అనంతరం 93 పరుగుల విజయ లక్ష్యంతో కారంపల్లె జట్టు బరిలోకి దిగింది. మొదట 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోగా బ్యాట్స్‌మెన్ శంకర్‌రాజు మొదట నెమ్మదిగా ఆడుతూ ఆ తర్వాత ఫోర్లు, సిక్సర్లు బాది 46 పరుగులతో కారంపల్లె జట్టు విజయానికి కీలకపాత్ర పోషించడంతో 11.2 ఓవర్లలో 96 పరుగులు చేసి విజయం సాధించింది. గెలుపొందిన కారంపల్లె జట్టు కెప్టెన్ లక్ష్మీనరసయ్య(పతి) రూ.40 వేలతో పాటు ట్రోఫీని క్రికెట్ కమిటీ సభ్యులతో అందుకున్నారు. రన్నర్‌గా నిలిచిన మందపల్లె జట్టుకు రూ.20 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. అద్భుతంగా బ్యాటింగ్ చేసిన శంకర్‌రాజు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్నారు.


విజేతగా నిలిచి కమిటీ సభ్యులచే ట్రోఫీని అందుకుంటున్న కారంపల్లె జట్టు కెప్టెన్ లక్ష్మీనరసయ్య

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

గాలివీడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరు, కన్నతల్లి, చదువుకున్న పాఠశాలను ఎంత ఎత్తుకు ఎదిగినా మరువకూడదని గుర్తుకు చేస్తూ చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి అలనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ 1985-1990 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు తమ గురువులతో కలిసి అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటిమధుర స్మృతులను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమావేశం నిర్వహించడం ద్వారా మనుషుల మధ్య బంధాలు బలపడతాయన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి విశ్రాంత ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు మల్లన్న, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివారెడ్డి, సుబ్బరాయుడు, గౌస్‌మోహిద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన గుండు గంగమ్మ తల్లి జాతర

రామాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె కస్పాలో వెలసిన గుండు గంగమ్మ తల్లి జాతర గురువారంతో ముగిసింది. రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పందిళ్లపల్లె బలరామయ్య అమ్మవారి ఈ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. గ్రామంలోని ఏడు చాందినీ బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా కోలాటాలు, చెక్కభజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా జాతరకు వచ్చిన భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరోజమ్మ, మాజీ సర్పంచ్ సుబ్బయ్య, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోలాటం నిర్వహిస్తున్న భజన బృందం

ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

● బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు అన్నారు. గురువారం సోమశిల వెనుకజలాల నీటి విడుదల కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రత్యేక సంకల్పంతో పట్టిసీమ ద్వారా గోదావరి నుంచి కృష్ణ, కృష్ణ నుంచి పెన్నాకు నీటిని అనుసంధానం ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని కరవు లేకుండా సస్యశ్యామలం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయన ప్రయత్నాన్ని అందరూ హర్షించాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరైంది కాదన్నారు.


కార్యకర్తలకు భరోసా కల్పించండి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి విజయంలో కీలక పాత్ర పోషించిన నిజమైన కార్యకర్తలకు టీడీపీ అధిష్ఠానం భరోసా కల్పించాలని రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పూలేల రమేష్ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని కస్తూరి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వ్యక్తులకు నియోజకవర్గంలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించకపోవడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లె క్లస్టర్, ఆర్‌టీఎస్ కో డైరెక్టర్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనెపల్లె చిన్న, కార్యకర్తలు అద్భుత్‌కుమార్, మధుసూదన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

బీజేపీ మండలాధ్యక్షుడిగా రమణగౌడ్

సుండుపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని పూజారివాండ్లపల్లెకు చెందిన ఎస్‌వీ రమణగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సుండుపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలియజేశారు. అధ్యక్షుడిగా ఎంపికైన రమణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పనిచేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్, బీజేపీ సీనియర్ నాయకులు గోపాల్‌రాజు, మహేశ్వర్‌రాజు, సత్యం నాయుడు, నరేంద్రరాజు, వెంకట్రమణ, నాగమునెయ్య పాల్గొన్నారు.


ఎస్‌వీ రమణగౌడ్

రుణాలతో ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు

వీరబల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రుణాలతో ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఏపీఎం ఖాదర్‌వలి కోరారు. గురువారం రాగిమానుదిన్నెపల్లె ప్రాథమిక పాఠశాలలో జరిగిన పెద్దివీడు గ్రామ సమాఖ్య-2 కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సంఘాల ద్వారా పొందే రుణాలతో స్థిరమైన జీవనోపాధులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబం కనీసం 5 కంటే ఎక్కువ జీవనోపాధుల ఏర్పాటు చేసుకొని ప్రతి జీవనోపాధికి రూ.10 వేల ఆదాయం పొందాలన్నారు. అలాంటి వారికి బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ కృష్ణయ్య, వీవో అధ్యక్షురాలు రెడ్డెమ్మ, వీవోఏ శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం

నందలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని మహిళలు గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పండుగ మూడు రోజులు గొబ్బెమ్మను తయారు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు చేసి గ్రామంలో గొబ్బెమ్మను ఊరేగిస్తూ మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ చెయ్యేరుకు తరలించారు. మహిళలంతా కలిసి చెయ్యేరులోని నీటిలో గొబ్బెమ్మకు మేళతాళాలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.


గొబ్బెమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

రెవెన్యూ దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సం బంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, ప్రభుత్వ భూముల గుర్తి ంపు, పల్లె పండుగ పనుల ప్రగతి తదితర అం శాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్, రెవె న్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తప్పనిసరి విచారణ చేప ట్టాలన్నారు. కనీసం రోజుకు ఐదు దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని సూచించారు. అలాగే రీ సర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకుని వాటిని పీజీఆర్ఎస్‌లో వెంటనే ఆన్‌లైన్ చేసి పరిష్కరించాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రతి మండల కార్యాలయం నుంచి ఈ ఆఫీసు లోనే జిల్లా కేంద్రానికి ఫైల్స్ పంపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు తగిన విధంగా ప్రతి మండల కార్యాలయంలో ఈ ఆఫీస్‌పై తహసీల్దార్, సంబంధిత సిబ్బంది వెంటనే శిక్షణ పొందాలని తెలిపారు. పల్లె పండుగకు సంబంధించిన పనులన్నింటినీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఇంకా ప్రారంభం కాని పను లు ఉన్నాయా అని ఆరా తీశారు. పనులు పూర్తికి అవసరమైన చోట ఉపాధి హామీ ద్వారా అదనంగా నిధులు మంజూరు చేయడానికి ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, గోకులాలు, కాలువలు తదితర మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, డ్వామా పీడీ వెంకటరత్నం, మండల స్థాయి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వరకు నిర్వహించే జాతీయ రహదారి మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, బుక్‌లెట్లు బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీవో, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో సోమవారం జరిగిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గురువారం ఉదయం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరీ విభాగం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎద్దులు పాల్గొనగా... నువ్వా, నేనా అన్నట్లు సాగిన పోరులో నంద్యాల పట్టణం పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణలోని సూర్యాపేట, హుజూరునగర్‌కు చెందిన సుంకి సురేంద్రారెడ్డి కంబైండ్ కాడెద్దులు 25 నిమిషాల వ్యవధిలో 3,643 అడుగులు దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. మైదుకూరుకు చెందిన కేవీఎస్ బుల్స్ కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 3,260 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 3,147 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు 3,208 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలవగా, గుంటూరు జిల్లా కుంచెనపల్లికి చెందిన పులం ట్రిస్నారెడ్డి కాడె 2,806 అడుగులు లాగి 5వ స్థానం దక్కించుకున్నాయి. కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,788 అడుగులు లాగి 6వ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. విజేతలకు మొదటి బహుమతిగా రాయల్ ఇన్‌ఫీల్డ్ 350 సీసీ (బుల్లెట్), రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుతి టీవీఎస్ ఫోర్ట్, 4వ బహుమతిగా టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25వేలు, 6వ బహుమతిగా రూ.15వేలు అందజేశారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేద్దాం : కలెక్టర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసి.. ప్రాణాలు కాపాడకుందామని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని దారి భద్రత ప్రచారం (శ్రద్ధ వహించండ) కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36వ జాతీయ రవాణా భద్రత మాసోత్సవాలు 2025లో భాగంగా 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రహదారి ప్రమాదాల క్షతగాత్రులకు నిస్వార్థంగా, స్వచ్ఛందంగా సహాయం అందించి, దగ్గరలోని ఆసుపత్రికి చేర్చాలన్నారు. గుడ్ సమిరిటన్‌కు రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ నేరమన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీసీఈఓ ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ హజ్రతయ్య, డీటీసీ, రవాణాశాఖ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భర్త మృతదేహంతో నిరసన

● న్యాయం చేయాలని వేడుకోలు


వెంకటయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

చాపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో షండ్ర యశోద తన భర్త వెంకటయ్య (35) మృతదేహాన్ని గురువారం అదే గ్రామానికి చెందిన ఎర్రిబోయిన ప్రసాదు ఇంటి ముందు ఉంచి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈనెల 15న బుధవారం వెంకటయ్య ఆ గ్రామం వద్ద ఉన్న బావిలో కాలు జారి నీళ్లలో పడి మృతి చెందాడు. యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, తన భర్త వెంకటయ్య వ్యవసాయకూలి పనులకు ప్రతి రోజూ ప్రసాదు పొలం వద్దకు వెళ్లేవాడని.. ఈ క్రమంలో భర్త చనిపోవడంతో కుటుంబానికి దిక్కులేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారని.. తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరుతూ.. గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేసింది. విషయం తెలిసిన ఎస్ఐ చిన్నపెద్దయ్య అక్కడకు చేరుకుని యశోదకు నచ్చచెప్పడంతో ఆమె ఆందోళన విరమించింది.

వెంకటరమణ మృతదేహం బయటపడేనా...!

● రెండు రోజులుగా గాలిస్తున్న రెస్క్యూ టీమ్

● అనుమానాలు వ్యక్తం చేస్తున్న బంధువులు

● అధికారుల తీరును నిరశిస్తూ ఆందోళన


వెంకటరమణ గల్లంతైన క్వారీ వద్ద ప్రజలు


కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

గుర్రంకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి క్వారీలో పడి మృతి చెందినట్లు చెబుతున్న వెంకటరమణ (24) మృతదేహం లభ్యం కాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీటిలో పడిన ఏ వ్యక్తి అయినా చనిపోతే 24 గంటల తరువాత మృతదేహం నీటిపై తేలుతుందన్నారు. వెంకటరమణ క్వారీలో పడి 30 గంటలు గడిచినా మృతదేహం తేలకపోవడం, రెండు రోజులుగా ఫైర్, రెస్క్యూ టీమ్ సభ్యులు గంటల తరబడి వెతికినా మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో అధికారుల తీరును నిరసిస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దద్దాలవారిపల్లెకు సమీపంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై గురువారం ధర్నా చేశారు. తమ కుమారుడిని వెతకడంతో అలసత్వం చేస్తున్నారంటూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు భారులు తీరాయి. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకొన్న తహశీల్దార్ శ్రీనివాసులు, వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబులు బాధితులతో మాట్లాడి మృతదేహాన్ని వెలికితీయడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కర్నూలు నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందం వస్తున్నట్లు తెలిపారు. ఈ బృందం రాగానే మృతదేహాన్ని గంటల వ్యవధిలోనే బయటకు తీస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, క్వారీలో వెంకటరమణ మృతదేహం ఉందా... ఉంటే ఎందుకు దొరకడం లేదు... లేకపోతే వెంకటరమణను తోడుగా వచ్చిన వారు ఏమైనా చేశారా అన్న అనుమానాలను బంధువులు వ్యక్తం చేస్తున్నారు.

వెంకటరమణ ఎక్కడున్నావురా....

పండగ పూట స్నేహితులతో కలిసి ఆడుకొని తిరిగి ఇంటికి వస్తానంటివే...అంతలోనే కనబడకుండా పోతివే.. అంటూ వెంకటరమణ తండ్రి సూరి బోరున విలపించడం చూపరులను కలచివేసింది.

ట్రాక్టర్ల చోరీ కేసులో నిందితుడు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పులివెందుల సీఐ

సింహాద్రిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన గత నెల 29వ తేదీ రాత్రి ఒక ట్రాక్టరు, రెండు ట్రాలీలు చోరీకి గురయ్యాయి. ఈ కేసుకు సంబంధించి నిందితుని అరెస్ట్ చేసినట్లు పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు... బాధితుడు కటికిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ నేతృత్వంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌తో కలసి విచారణ చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో పులివెందుల మెయిన్ రోడ్డులోని హిమకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన సింహాద్రిపురం గ్రామం బీడీ కాలనీకి చెందిన యర్రగుడి బాబా అలియాస్ చోటును అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారణ చేయగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, లింగాల ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి



కమలాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండలం గంగవరం ఎంపీయూపీ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తులసీధర్ (55) గురువారం ఉదయం ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తులసీధర్ మూడు రోజుల క్రితం బైకులో కడపకు వెళుతుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కడపలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతి చెందాడు. ఈయన స్వస్థలం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామం. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే తులసీధర్ మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తులసీధర్ మృతి పట్ల ఉపాధ్యాయసంఘ నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

మిద్దెపై నుంచి పడి ఆర్ఎంపీ మృతి

ఓబులవారిపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎంపీ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందాడు. ఓబులవారిపల్లెకు చెందిన బసెట్టి సుబ్రమణ్యం (61) మండల పోలీసుస్టేషన్‌కు వెళ్లేదారిలో ప్రథమ చికిత్స కేంద్రం నడిపేవారు. గురువారం సాయంత్రం మిద్దెపైన జామకాయలు కోసే క్రమంలో కాలుజారి సన్‌సైడ్ బండ మీదపడడంతో తలకు తీవ్రగాయమైంది. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

గొబ్బెమ్మ ఊరేగింపులో ఘర్షణ


గుమికూడిన జనం

ఒంటిమిట్ట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గొబ్బెమ్మ ఊరేగింపులో రెండు వర్గాల యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్థానిక కల్లావీది నుంచి గొబ్బెమ్మను మహిళలు, యువకులు కేరింతలు కొడుతూ అమ్మవారిని నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో మాడవీధికి చెందిన కొంతమంది యువకులు గొబ్బెమ్మ ఊరేగింపులో పాల్గొనేందుకు రావడంతో ఇరువర్గాలు మధ్య ఒక్కసారిగా ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో అక్కడే ఉన్న మహిళలు, యువకుల మధ్య ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఇరువర్గాలవారు పెద్దఎత్తున ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గొబ్బెమ్మ మీద ఊరేగింపులో పాల్గొనే మహిళలపై దాడి చేయడంతో ఒక్కసారిగా వారి బంధువులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం ఎస్ఐ శివప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఘటన స్థలానికి వచ్చిన ఎస్ఐ శివప్రసాద్ ఇరువర్గాలవారిని చెదరగొట్టారు. దాడిలో బంగారు చైనుతో పాటు బంగారు వస్తువులు పోయినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలవారిని పిలిపించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

బస్సు బోల్తా... పలువురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో బోల్తాపడ్డ బస్సు, గాయపడ్డ ప్రయాణికులు

కురబలకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట పంచాయతీ జంగావారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి బెంగళూరుకు వెలుతున్న బస్సు మార్గమధ్యంలోని కురబలకోట మండలం జంగా వారిపల్లె సమీపంలో డ్రైవర్ కునుకు తీయడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈప్రమాదంలో 10మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తా పుల్లారెడ్డికి భూతపురి స్మారక పురస్కారం


పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ సాహితీవేత్త భారత భారతి పుత్తా పుల్లారెడ్డి మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 23వ స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ భూత పురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యం లో ఫిబ్రవరి 16న ఆదివారం ఉదయం 10గంటలకు కడప సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో జరిగే భూతపురి 88వ జయంతి మహోత్సవంలో ఈ పురస్కారం అందజేయనున్నారు. సాహిత్య జ్యోతిష్య రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు 2003 నుంచి ఈ పురస్కారం అందిస్తున్నట్లు భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి భూతపురి శివరామసురేంద్ర శర్మ తెలిపారు. ఆక్రమంలో పుత్తా పుల్లారెడ్డిని రూ.10,116లతో నగదు, జ్ఞాపికతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. వృత్తిరీత్యా ఇంజనీరు అయిన పుత్తా పుల్లారెడ్డి పదవీ విరమణ తరువాత సాహిత్యరంగంలో అడుగుపెట్టి అనేక పరిశోధనాత్మక రచనలు, వ్యాఖ్యానాలు, సంకలన గ్రంథాలు, రచనలు వెలువరించడం విశేషమన్నారు. పుత్తా పుల్లారెడ్డి నీటిపారుదల శాఖలో సూపర్‌వైజర్ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్థాయి వరకు పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి పలు సంస్థలు ఘనంగా సత్కరించాయని తెలిపారు.

రైతు బిడ్డకు జంప్‌రోప్‌లో బంగారుపతకం


రామిరెడ్డి ప్రసన్న

వేంపల్లె, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముతుకూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి ప్రసన్న జంప్‌రోప్ క్రీడలో అద్భుతంగా రాణిస్తోంది. అంతర్జాతీయస్థాయిలో నేపాల్‌లో జరిగిన పోటీల్లో వివిధ దేశాలతో పోటీపడి బంగారు పతకం అందుకుంది. పేద రైతు రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి, రామలక్షుమ్మల కుమార్తె ప్రసన్న సింహాద్రిపురం కస్తూర్బా పాఠశాలలో చదుకుంటూ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జంప్‌రోప్ క్రీడల్లో పాల్గొంది. అంతర్జాతీయస్థాయిలో కూడా రాణించి పతకాలు సాధించింది.

అక్రమ కట్టడాలు కూల్చివేత


అక్రమ కట్టడాలను కూల్చి వేయిస్తున్న వీఆర్వో శ్రీనివాసులు

కడప కలెక్టరేట్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి) నగర పరిధి లోని ఉక్కాయపల్లి బైపాస్ రోడ్డు, చలమారెడ్డిపల్లెలో ప్రభు త్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది గురు వారం రాత్రి కూల్చివేశారు. నాలుగు సెంట్ల స్థలంలో సెలవు రోజుల్లో కబ్జాదారులు రాత్రికి రాత్రి అక్రమంగా బేస్ మట్టాలు నిర్మించారు. విషయం తెలుసుకున్న తహ సీల్దారు నారాయణరెడ్డి వెంటనే నిర్మాణాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ శివకుమార్‌లు ఆస్థలంలో నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

సీజ్ చేసిన బోరు ఓపెన్

●యథావిధిగా నీటిసరఫరా ● సీఎంవో ఫిర్యాదుపై స్పందన ఉన్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదంటున్న వైనం

మదనపల్లె, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోరు తవ్వి నీటిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారని సీఎంవోకు ఫిర్యాదు చేయడం స్పందించిన అధికారులు బోరు సీజ్ చేశారు. అనంతరం ఆ నివేదికను ప్రభుత్వానికి పంపడంతోపాటు ఫిర్యాదు దారునికి కూడా బోరు సీజ్ చేసినట్లు సమాధానం ఇచ్చి అతని నుంచి సంతకాలు కూడా తీసుకున్నారు. అంత వరకూ బాగానే ఉన్నా..తర్వాత చూస్తే అదే బోరు యథావిధిగా పనిచేస్తున్నా..అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై ఇలా ఎందుకు జరుగుతోందంటూ జనం అసంతృప్తి అసహనం వ్యక్తంచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...మదనపల్లె మండలం బసినికొండ-2 పంచాయతీ మొలకలదిన్నె రోడ్డులో ఓ వ్యక్తి షెడ్డు నిర్మించి, ప్రభుత్వ భూమిలో బోరు వేసి నీటిని వాడుకుంటున్నట్లు స్థానికులతో కలసి అదే పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి, గతేడాది సెప్టెంబరులో ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలు నవంబరు 22న క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గంగమ్మగుడి ఏరియాకు చెందిన కె.చలపతి, రస్తా పొరంబోకులో బోరు వేసి నీటిని పొలానికి వాడుకుంటున్నారని గుర్తించారు. పైపు లైన్ కనెక్షన్ కట్ చేసి, బోరు పంచాయతీ స్వాధీనం చేసుకుందని వారు పేర్కొన్నారు. అలాగే బోరు నీటిని ల్యాబ్ టెస్టింగ్‌కు పంపి, నీటిని గ్రామ పంచాయతీ ప్రజలకు సరఫరా చేస్తామని, బాబురెడ్డికి ఇచ్చిన సమాధానం రూపంలో ఇచ్చిన ఎండార్సుమెంట్‌లో పేర్కొన్నారు. సీఎంవో ప్రజాపరిష్కార వేదికకు ఇచ్చే స్పందన ఇలాగేనా అంటూ స్థానికులు వాపోతున్నారు. బోరు సీజ్ చేసిన ఎంపీడీవో, తిరిగి ఎలా ఓపెన్ చేశారో చెప్పాలని, దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత కోరుతున్నారు.



మొలకలదిన్నె రోడ్డులో బోరును సీజ్ చేస్తున్న పంచాయతీ అధికారులు(ఫైల్)

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

●డీఎల్‌పీవో విచారణ ● రికార్డులు స్వాధీనం

మదనపల్లె టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం- 2 గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని వచ్చిన ఫిర్యాదులపై డీఎల్‌పీవో నాగరాజు విచా రణ చేపట్టారు. గురువారం సీటీఎం-2 సచివాలయంలో ఫిర్యాదిదారుడితో పాటు, అధికారులను డీఎల్‌పీవో విచారించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకుడు ఉత్తన్న మాట్లాడుతూ ఐదేళ్లుగా సీటీఎం-2 పంచాయతీకి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, ఇతర వనరుల ద్వారా గ్రామ పంచాయతీకి వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాల కోసం ఆర్‌టీఐ ద్వారా తాను దరఖాస్తు చేసుకుంటే, ఆరు నెలలు అయినా సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్‌కు, అక్కడి నుంచి డీపీవో ద్వారా తనకు ఫిర్యాదు కాపీలు వచ్చాయని దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. అంతే కాకుండా పంచాయతీ సచివాలయంలోని రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నామని, ఒకవేళ నిధులు దుర్వినియోగం అయివుంటే వాటిపై కలెక్టర్‌కు నివేదికలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అబ్దుల్ షకూర్, అధికారులు పాల్గొన్నారు.



సీటీఎం-2 సచివాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

సమస్యల పరిష్కారానికి వార్డు, గ్రామాల్లో సభలు

మదనపల్లె టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో పదేళ్లపాటు పనిచేసిన ఎమ్మెల్యేలు అభివృద్ధి చేయకుండా సర్వనాశనం చేశారని, వాటిని బాగుచేసేందుకు గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరు నెలల కాలంలోనే సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు రూ.8కోట్ల నిధులు మంజూరు చేయిం చారని, తాజాగా మరో రూ.5కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వారంలో ఐదు రోజులు ప్రజల వద్దకు వెళ్లి అధికారుల పనితీరు, పాలనపై సమీక్షలు నిర్వహిస్తామన్నారు. వార్డు సభల్లో రేషన్‌కార్డులు, పింఛన్లు, హౌసింగ్ ఇళ్లను కేటాయిస్తామన్నారు. సీఎం చంద్రబాబును మదనపల్లె పర్యటనకు ఆహ్వానించామన్నారు. సమావేశంలో జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్, నీలకంఠ, ఎం.నాగయ్య, బాలుస్వామి, దేవేంద్ర, బాబాఫక్రుద్దీన్, చిన్నమహేష్, పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నేటి నుంచి అంతర్‌జిల్లా హాకీ పోటీలు

మదనపల్లె టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని జిబరాతసదా స్టేడియంలో నేటి నుంచి అంతర్‌జిల్లా హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ ప్రసాద్, సెక్రటరి శివప్రసాద్, ట్రెజరర్ ప్రసాదరెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి 22 జిల్లాల జట్లు పాల్గొంటాయన్నారు. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజ పాల్గొన్నారు.

మండల సమావేశాన్ని సజావుగా నిర్వహించండి

కురబలకోట, జనవరి 16(ఆంధ్ర జ్యోతి): మండల సమావేశాన్ని సజావుగా నిర్వహించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాన్ని అడ్డుకోవద్దన్నారు. కురబలకోట మండల తాగునీటి అవసరాల కోసం రూ.34లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులను విడతల వారీగా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల సమావేశానికి కూటమికి 5మందికి అవకాశం ఇవ్వాలని టీడీపీ నేత జయచంద్రారెడ్డి సమావేశంలో కోరగా దీనిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏకపక్షంగా వ్యవహరించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అందుకే అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, తహశీల్దార్ తపశ్విని, టీడీపీ నేతలు మల్లికార్జున నాయుడు, గురవారెడ్డి, అయూబ్‌బాషా, సూరి,రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కురబలకోట మండల సమావేశం

కురబలకోట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండల సర్వసభ్య సమావేశంను గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని కోరారు. అలాగే ఎస్‌ఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 30యాక్టు అమలు చేయనున్నామని ఎవ్వరు ధర్నాలు, రాస్తారోకోలు, గొడవలు చేయరాదన్నారు.అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటుగా తహశీల్దార్ ఉత్తర్వులతో 144సీఆర్పీసీ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా రాటకొండ బాబురెడ్డి జన్మదినవేడుకలు

మదనపల్లె టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబు రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక శాస్త్రివీధిలోని బాబురెడ్డి నివాసంలో ఉదయం నుంచే పెద్దఎత్తున నియోజక వర్గం నలుమూలల నుంచి టీడీపీ నాయకులు వచ్చి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, సంగం శ్రీనివాసులు, నవీన్‌చౌదరి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక దేవతానగర్‌లోని చైతన్య అనాథాశ్రమంలో బాబురెడ్డి పేరు మీద చిన్నారులకు అన్నదానం నిర్వహించారు.



బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

30 ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం

మదనపల్లె టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో 30 ఏళ్లుగా పరిష్కారం కాని దీర్ఘకాల సమస్యలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిష్కారం చూపారు. గురువారం మండలంలోని కోళ్లబైలు, కురవంక గ్రామపంచాయతీల్లో రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులోని ఈ పంచాయతీలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని, అందుకే ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీరాజ్ ఏఈ రమణ, టీడీపీ నాయకులు రాటకొండ శ్రీని వాసులు, నాగార్జునగాంధీ, జంగాల రమణ, శశికుమార్, రెడ్డిప్రసాద్, జేసీబీ మధు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి పట్ల ఎమ్మెల్యే నల్లారి నివాళి

పీలేరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కలకడ మండలం రాతిగుంటపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు రామ్మోహన్ భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కలకడ-గుర్రంకొండ మార్గమధ్యంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామ్మోహన్ మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి గురువారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆసుపత్రికి చేరుకుని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మోహన్ మృతి కలకడ మండలంలో టీడీపీకి తీరని లోటు అని, ఆయన కుటుంబానికి తాము ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, మల్లెల రెడ్డిబాషా, జాఫర్, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, లక్ష్మీకర, మనోహర, పీవీ నాయుడు, రాజా, పురం మల్లయ్య, బుజ్జి పాల్గొన్నారు.



రామ్మోహన్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి

గుండెపోటుతో ఎకనామిక్స్ అధ్యాపకుడు మృతి

తంబళ్లపల్లె, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న వి.వెంకట్రమణ(43) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం ఏకోలింపల్లెకు చెందిన వెంకట్రమణ తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు పది సంవత్సరాల నుంచి ఎకనామిక్స్ సబ్జెక్ట్‌కు కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఈయన గురువారం ఉదయం రాయచోటిలో స్వగృహంలో ఉండగా గుండెలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి నలుగురు పిల్లలు శ్రీనివాసులు, శ్రీ లక్ష్మీ, లాస్య, హర్షవర్ధన్ ఉన్నారు. భార్య వి.రాజేశ్వరీ నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందింది. తల్లితండ్రులిద్దరూ మృతిచెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం స్పందించి పిల్లలను ఆదుకోవాలని స్థానికులు, మృతుడి బంధువులు కోరుతున్నారు. వెంకట్రమణ మృతి పట్ల ఎఫ్‌ఏసీ ఇంచార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఏకోలింపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వాల్మీకిపురంలో ఉపాధ్యాయుడు మృతి

వాల్మీకిపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో నివాసముంటున్న చిత్తూరు జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అప్సర్‌ఖాన్‌సాహెబ్(55) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సహ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, స్థానికులు అప్సర్‌ఖాన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామమైన బి.కొత్తకోటకు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి):వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లె పట్టణం, మార్వారివీధికి చెందిన జయప్రకాష్ (35)అక్టోబరు31న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సమీప బంధువులు, స్నేహితుల ఊళ్లలో వెతికిన దొరకకపోడవంతో గురువారం అతని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

104 గ్యాస్ సిలిండర్లు సీజ్

గుర్రంకొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి):అక్రమంగా విక్రయిస్తున్న 104 గ్యాస్ సిలిండర్లను వాల్మీకీపురం సీఎస్‌డీటీ ఫజులుల్లా గురువారం సీజ్ చేసినట్లు తెలిపారు. గుర్రంకొండ పట్టణంలోని కొత్తపేటలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో డీఎస్‌వో, సీఎస్‌డీటీలు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఓ గదిలో అక్రమంగా దాచి ఉంచిన 104 గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లను పట్టణంలో ఉన్న గ్యాస్ గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రికెట్ క్రీడాకారులకు సన్మానం

మదనపల్లె అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి):స్థానిక మదనపల్లె హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో అండర్-14కు ఎంపికైన క్రికెట్ క్రీడాకారులు హేతేష్, తేజేష్‌లను హెల్పింగ్ మైండ్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ వారికి దుశ్శాలువాలు కప్పి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 రాష్ట్ర జట్టుకు మదనపల్లె క్రీడాకారులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రికెట్ లో యువకులు రాణించడంతో మదనపల్లె పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగుతుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 27 నుంచి పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా అంతర్‌రాష్ట్ర టోర్నీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్ సభ్యులు కిరన్, చరన్, జతిన్, హర్షలు పాల్గొన్నారు.

పీలేరులో పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

పీలేరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ గురు వారం పీలేరుకు విచ్చేశారు. ఈ సంద ర్భంగా పీలేరుకు చెందిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత తేజ సాకే శైలజానాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి నుంచి అనంతపురానికి వెళుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం పీలేరులో కాసేపు ఆగి అమృతతేజను పలుకరించారు. సమైఖ్యాంధ్ర, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఉద్యమాల నాటి జ్ఞాపకాలను వారిద్దరూ కాసేపు నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు యూసుఫ్, సాయిసంపత్ కుమార్ పాల్గొన్నారు.



పీలేరు కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

వాల్మీకిపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పీలేరు నియోజక వర్గ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు మహిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతప ర్తి గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ టోర్నీ సంద ర్భంగా గురువారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి టోర్నమెంట్ విజేతలుగా గెలిచిన చింతపర్తి, బోయపల్లె జట్లకు బహుమతులు అందించారు. కార్యక్రమాలలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు లంకిపల్లె మధు, జయచంద్రనాయుడు, టోర్నమెంట్ ఆర్గనైజర్ జమీర్ ఆలీఖాన్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ యువత అధ్యక్షుడు మహిధర్‌రెడ్డి

రోడ్డు సమస్యను తీర్చాలంటూ మహిళల నిరసన

మదనపల్లె అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె గ్రామం చిలకవారిపల్లెకు రోడ్డు సమస్య తీర్చాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు బాలజ్యోతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిలకవారిపల్లెకు రోడ్డు సమస్య వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు శాంతమ్మ, కదిరమ్మ, ఆనంద, సులోచన, లక్ష్మీదేవి, శంకరమ్మ, శోభరాణి, చెంగమ్మ, నరసమ్మ, పద్మావతి, పరిమిళ, సరోజమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పెద్దమండ్యం, జనవరి 16(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం పాడి రైతులకు అండ గా నిలిచిందని తంబళ్లపల్లె నియోజక వర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. పెద్దమండ్యం లో గురువారం గోకులం షెడ్డు ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఏపీఐబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ షై ఫోర్స్ మహేష్, మండల జనసేన పార్టీ నేతలు నాగూరి మస్తాన్, అస్రఫ్, శంకర, బీసీ సంఘం అధ్యక్షుడు చలపతి తదితరులు పాల్గొన్నారు.

కనకదాస్ జయంతికి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

మదనపల్లె అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోఈ నెల 23న నిర్వహిస్తున్న భక్త కనకదాస్ 537 జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌ను, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆర్‌కే శ్రీనివాసులు, కార్యదర్శి మరిపాటి రమేష్, న్యాయవాది మనోహర్, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు కప్పల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కొత్తకోట శ్రీకాంత్

పెద్దతిప్పసముద్రం జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండల బీజేపీ అధ్యక్షుడిగా మద్దయగారిపల్లెకు చెందిన కొత్తకోట శ్రీకాంత్ నియమి తులయ్యారు. గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అధ్వర్యంలో నియమాకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీని గ్రామీణ ప్రాంతాల్లో బలోపేతం చేస్తానన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, పూల నాగరాజు, వెంకటనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



విజేత జట్టుకు రూ.25వేలు చెక్కు అందిస్తున్న శ్రీరామ్‌చినబాబు, చలపతి

మదనపల్లె టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిప్పిలి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా వీఎస్‌ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన హనుమాన్ జట్టుకు రూ.25 వేలు, రన్నరప్ జట్టు చిప్పిలి అటాకర్స్‌కు రూ.15వేలు చెక్కులు అందజేశారు. కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో అంపైర్స్, మిగిలిన క్రీడాకారులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, శివకుమార్, పునీత్, మహబూబ్‌ఖాన్, పసుపులేటి శశికుమార్, రఫీ, చిరంజీవి, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలోని ముత్తు స్కూల్‌లో గురువారం గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ మణికంఠ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం, గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవ వారో త్సవాల్లో భాగంగా సంక్రాంతి కల్చరల్ డే సందర్భంగా పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. ఆడపిల్లలకు గాజులు, మెహందీ బాక్సస్, చాకెట్లు పంచిపెట్టారు. కార్యక్రమానికి మంగమ్మ, పద్మ, చైతన్య సేవాసంస్థ కవితారాణి, గిరిజమాల్, ఆనందనన్, కృష్ణచరణ్ పాల్గొన్నారు.